


వైకుంఠ ఏకాదశి సందర్భంగా సిద్దిపేటలో ఉత్తర ద్వార దర్శనం అనంతరం వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

# తుది శ్వాస వరకు ప్రజాసేవ చేస్తా..

## సిద్దిపేట పెద్ద దవాఖానను సద్వినియోగం చేసుకోవాలి

- వైకుంఠనాథుడి కృపాకటాక్షాలతో అందరూ సుభిక్షంగా ఉండాలి
- కరోనా ప్రబలకుండా జాగ్రత్తలు వహించాలి
- గాడ్ విజన్ అసోసియేషన్ పాస్టర్ల యూనియన్‌కు వేతనం అందిస్తా
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు
- సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల అందజేత
- క్రిస్మస్ వేడుకలు, విశ్వ హృదయ సమ్మేళనంలో సిద్దిపేట ఎమ్మెల్యే

సిద్దిపేట, డిసెంబర్ 23: తన తుది శ్వాస వరకు సిద్దిపేట ప్రజలకు సేవ చేస్తానని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలోని 153 మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. 120 మందికి 59 జీవో పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు 11 వేల మందికి కల్యాణలక్ష్మి ద్వారా రూ.93 కోట్ల ఆర్థిక చేయూతనిచ్చి, పేదింటి ఆడబిడ్డల పెండ్లికి ఆసరాగా నిలిచామన్నారు. సిద్దిపేటలో కార్పొరేట్ స్థాయిలో దవాఖాన ఏర్పాటు చేశామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రైవేట్ దవాఖానకు వెళ్లి డబ్బు వృథా చేసుకోవద్దన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలని న్యూట్రిషన్ కిట్ అందిస్తున్నట్లు తెలిపారు.

### వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం

వైకుంఠనాథుడి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మొక్కుకున్నారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శనివారం సిద్దిపేట వేంకటేశ్వర స్వామి దేవాలయం, పారుపల్లి వీధిలోని పాత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర ప్రజలకు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. దేశం, రాష్ట్రంలో కరోనా మహమ్మారి ప్రబలకుండా చూడాలని ప్రార్థించారు.



సిద్దిపేటలో నిర్వహించిన విశ్వ హృదయ సమ్మేళనంలో పాల్గొన్న మహిళలు

### యోగా ధ్యానంతోనే ఆరోగ్యం.. ఆనందం

యోగా, ధ్యానంతోనే ఆరోగ్యం, ఆనందం కలుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రిశీ ప్రభాకర్ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో సిద్దిపేట వైశ్య సదనంలో నిర్వహించిన విశ్వ హృదయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. సిద్దిపేటలోని రిశీ ప్రభాకర్ విద్యాకేంద్రం ఆధ్వర్యంలో విశ్వ హృదయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేర్గు మంజులా రాజనర్సు, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, గుండు రవితేజ, ఆలయ కమిటీ సభ్యులు, ఎంపీపీ మాణిక్యరెడ్డి, నాయకులు సికిందర్, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గణేశ్‌నగర్ హనుమాన్ దేవాలయంలో తూర్పు ద్వారం ప్రారంభం

సిద్దిపేటలోని గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన తూర్పు ద్వారాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రారంభించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

### సిద్దిపేట.. సర్వమతాలకు నెలవు

సిద్దిపేట సర్వ మతాలకు నెలవని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటలో గాడ్ విజన్ అసోసియేషన్, పాస్టర్స్ యూనియన్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నామినేషన్ వేసే సమయంలో వేంకటేశ్వర స్వామి గుడితో పాటు మన సిద్దిపేట చర్చ్‌లో ప్రార్థనలు చేస్తానని గుర్తుచేశారు. సిద్దిపేట అంటేనే సర్వ మతాలను గౌరవించే సంస్కృతి సంప్రదాయాలు మనవన్నారు. దసరా, బతుకమ్మ పండుగలకు ఏ విధంగా కానుక ఇస్తామో క్రిస్మస్‌లో క్రిస్టియన్లకు గౌరవించుకుంటానన్నారు. సమాజ శ్రేయస్సుకు పాటు పడుతున్న అసోసియేషన్ పెద్దలకు అభినందనలు తెలిపారు. సమాజ సేవలో వారితో పాటుగా భాగస్వామినవుతానని, తన నెల వేతనం మీ అసోసియేషన్‌కు ఉడుతా భక్తి సహాయంగా అందిస్తానన్నారు. అసోసియేషన్‌తో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలు జరుపుకొన్నారు.



గణేశ్‌నగర్ ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో తూర్పు ద్వారాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



సిద్దిపేటలో 59 జీవో కింద పట్టాలు ఆందజేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



లింగారెడ్డిపల్లి పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సరస్వతి శిశుమందిర్ విద్యాలయానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

### పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట కమాన్, డిసెంబర్ 23: సిద్దిపేట పట్టణ శివారులోని లింగారెడ్డిపల్లి పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సరస్వతి శిశు మందిర్ విద్యాలయానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు భూమిపూజ చేశారు. లింగారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ రామస్వామి కుమారుడి వివాహం జరిగింది. శనివారం వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరూలను ఆశీర్వదించారు. బూరుగుపల్లి సర్పంచ్ కమలాకర్‌రావుకు గుండెకు సంబంధిత చికిత్స జరిగి, విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయనను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.


# మెడికల్ కాలేజీని ప్రారంభించాలి

- ప్రజల తీర్పును శిరసావహిస్తాం
- ప్రజలకు నష్టం జరిగితే గళ మెత్తుతాం
- పేదవారికి మెరుగైన వైద్యం అందించాలి
- గత ప్రభుత్వంలో మంజూరైన నిధులు యథావిధిగా విడుదల చేయాలి
- మెదక్ అభివృద్ధిపై నిర్లక్ష్యం వద్దు
- కక్షసాధింపు చర్యలు సహించం
- మెదక్ బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ సర్కారు మంజూరు చేసిన మెదక్ మెడికల్ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం జూన్ నుంచి ప్రారంభించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ సర్కార్ రాష్ట్రంలోని 33 జిల్లాలకు మెడికల్ కళాశాలలు మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఇందులో భాగంగా మెదక్‌కు మెడికల్ కళాశాల కేటాయించి, నిర్మాణానికి రూ.180 కోట్లు మంజూరు చేశారని, మూడు నెలల క్రితం శంకుస్థాపన కూడా చేశారన్నారు. వచ్చే విద్యా సంవత్సరం జూన్‌లో 100 సీట్లతో కళాశాలను ప్రారంభించాలని పద్మాదేవేందర్‌రెడ్డి కోరారు. మెదక్ జిల్లా ప్రాంత ప్రజలు వైద్య విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో కేసీఆర్ మెడికల్ కాలేజీని మంజూరు చేశారన్నారు. అయితే, ఇప్పటికే సెంట్రల్ కమిటీ వచ్చి సమీక్ష చేయాల్సి ఉందని తెలిపారు. తమ సర్కార్ మంజూరు చేసిన కాలేజీని రద్దు చేయొద్దని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### ప్రజల తీర్పును శిరసా వహిస్తాం...

ప్రజలు ఇచ్చిన తీర్పును శిరసావహిస్తామని, ఇందులో ఎలాంటి సందేహం లేదని పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. కానీ ప్రజలకు ఇబ్బందులు కలిగితే గళమెత్తుతామని హెచ్చరించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని స్థానిక ఎమ్మెల్యే వినియోగించుకోవాలని సూచించారు. కక్షసాధింపు చర్యలకు పాల్పడితే ఊరుకునేది లేదని తెలిపారు. కేసీఆర్ సర్కారు మంజూరు చేసిన నిధులను యథావిధిగా విడుదల చేయాలని కోరారు. మెదక్ అభివృద్ధిని పట్టించుకోవాలని, ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రజల పక్షాన ప్రశ్నిస్తామన్నారు. మెదక్ పట్టణంలోని మాతాశిశు సంరక్షణ కేంద్రంలో వంద శాతం డెలివరీలు జరుగుతున్నాయని, గర్భిణులు, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నదని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం కేసీఆర్ సర్కారు ఎంసీహెచ్‌ను ఏర్పాటు చేసిందని, అందులో 25 శాతం శానిటేషన్‌ను తగ్గించడం తగదన్నారు. అక్కడ పనిచేసే కార్మికులకు కూడా జీతాలు తగ్గుతున్నాయని తెలిపారు. వెంటనే దానిపై సమీక్ష చేసి రివైజ్ చేయాలని సూచించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేయాలని తెలిపారు. సమావేశంలో జడ్పీచైర్‌పర్సన్ హేమలతాగౌడ్, వైస్‌చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, జడ్పీటీసీ సుజాతా శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు ఆర్‌కే శ్రీనివాస్, వంజరి జయరాజ్, కిశోర్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, కృష్ణ, జయరాంరెడ్డి, కిష్టయ్య, మోహన్, గట్టేశ్, సాయిలు, నవీన్, పోచయ్య, ముకుందం, బాల్‌రాజ్, కిషన్ పాల్గొన్నారు.



మెదక్‌లో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి